క్లుప్తంగా

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు



ఆత్మకూర్: మండలంలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణికి అధికారులు గైర్హాజరవుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తహసీల్దార్ మినహా అన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కాగా భూ, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు ఫిర్యాదులు అందాయని, అధికారుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ రాజు అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు పుల్గర్‌చర్లలో పలువురికి సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిన చెక్కులను ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన జెట్టి మద్దిలేటికి రూ.32 వేలు, పోచమోని రాములుకు రూ.17 వేల చెక్కులను ఎంపీటీసీ గుండపల్లి భాస్కర్‌రెడ్డి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవులు అందజేశారు. అలాగే పుల్గర్‌చర్లలో బత్తుల సింధూజకు రూ.16 వేలు, శాంతమ్మకు రూ.9,500, లక్ష్మికి రూ.33,500, లక్ష్మీదేవమ్మకు రూ.13 వేల చెక్కులను బీఆర్ఎస్ నాయకులు ఎద్దుల సురేందర్‌రెడ్డి, కోదండం, నర్సింహ, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గాలన్న అందజేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో సప్తాహం

పెబ్బేరు రూరల్: మారుతి భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ భజన చేశారు. ఈ భజన కార్యక్రమం 26 న ముగుస్తుందన్నారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

వనపర్తి: జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఉన్న తిరుమలయ్యగుట్ట, తిరుమలనాథస్వామి ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సోమవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాము అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. తిరుమలయ్య గుట్ట చుట్టూ ఉన్న అటవీ ప్రాంతంలో అరుదైన మొక్కలు, ఎన్నో జీవ జాతులు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. ఏటా శ్రావణమాసంలో ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలకు స్థానిక భక్తులతోపాటు సుదూర ప్రాంతాల నుంచి సైతం పెద్దసంఖ్యలో తరలివస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీతారాములు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చర్యలు

ఆత్మకూర్: వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ నరేందర్ అన్నారు. సోమవారం సీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా ప్రజలందరూ శాంతియుతంగా మెలగాలని కోరారు. పండుగల సందర్భంగా మతాలు, వ్యక్తులను కించపర్చడం, శాంతిభద్రతలను విఘాతం కలిగించడం లాంటి కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనీస వేతనం ఇవ్వాలి

పెబ్బేరు రూరల్: ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి మర్రికుంట ధర్నా చౌక్ వరకు చేరుకొని సమ్మె చేశారు. కార్యక్రమంలో మండ్ల రాజు, బుచ్చమ్మ, సునీత, చిట్టెమ్మ, అలివేల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

సాక్షి, నెట్‌వర్క్: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 15రోజులుగా సమ్మె చేస్తున్నా సీఎం కేసీఆర్ నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నాడని సీఐటీయూ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం అంగన్‌వాడీలు జిల్లావ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో శారద, రాధ, నాగేంద్రమ్మ, విజయలక్ష్మి, పుట్ట ఆంజనేయులు, రమేష్, రాజు, బుచ్చన్న, సత్యం రాణి, నిర్మల, స్వర్ణలత, మంజుల, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

- చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి
- ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 ప్రారంభం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవజాతికి మనుగడ ఉంటుందని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని విశ్వభారతి హైస్కూల్లో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హై సేవా, వేస్ట్ టూ వండర్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు పర్యావరణం, స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్లాస్టిక్, వ్యర్థాలు, నష్టాల గురించి అవగాహన కల్పించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్ యాదమ్మ, పాఠశాల డైరెక్టర్ బాల్‌రాజు, ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

అమరచింత: మనతో పాటు మన ఇంటి చుట్టు ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనమందరం ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరిసరాల శుభ్రత గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించి స్వచ్ఛత పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి చెత్త సేకరణ వాహనంలో వేయాలని సూచించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఇంటి ముందు మురుగు నిల్వ ఉండరాదని, పాడైన వస్తువులను పరిసరాల్లో పెట్టుకోకూడదన్నారు. ఈగలు, దోమల వ్యాప్తి కారణంగా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తించెందే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం కరుణాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్

చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

కొత్తకోట: పట్టణ కేంద్రాన్ని చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో బాలికల పాఠశాలలో తడి చెత్త, పొడి చెత్త విభజన కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఐఎస్ఎల్‌ఓ నమూనాలో కూర్చున్నారు. అనంతరం కమిషనర్ ఉపాధ్యాయులచే, విద్యార్థులచే చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు కృషి చేయాలంటూ ప్రతిజ్ఞ చేయించారు.



కొత్తకోటలో..

సమస్యలు అధిగమిస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ ఆవుల శైలజ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీచైర్మన్ ఆర్ లోక్‌నాథ్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి వివరించారు. ప్రజాప్రతినిధులు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధి సాధించాలని సూచించారు. సమావేశంలో ఒక్కో శాఖ నుంచి అధికారులు నివేదిక చదివి వినిపించారు. మూడు నెలలకు ఒక్కసారి జరిగే మండల సమావేశంలో ప్రజా సమస్యలను చర్చించాల్సిన వేదికలలో 8 మంది ఎంపీటీసీలకు గాను ఐదుగురు, 20మంది సర్పంచ్‌లకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. సభలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రజల సమస్యల గురించి మాట్లాడే వారే కరువయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ బాల చంద్రారెడ్డి, ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, తహసీల్దార్ సంధ్య, సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పథకాలతో దివాలా తీయడం ఖాయం



మాట్లాడుతున్న పాండురంగ

ఆత్మకూర్: రాష్ట్రంలో ఇది వరకే ఉచితాలు ఎక్కువయ్యాయని, దీని కారణంగా రాష్ట్రం దివాలా తీయడం ఖాయమని, ఇప్పటికే రూ.5లక్షల కోట్లు అప్పు దాటిందని తెలంగాణ రాష్ట్ర రైతు కార్మిక జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాండురంగ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర రైతు కార్మిక జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, రానున్న ఎన్నికల సందర్భంగా మేము అధికారంలోకి వస్తే అన్ని ఉచితం అంటూ ఇతర పార్టీలు ప్రకటనలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలతో ప్రజలు సోమరులుగా మారుతున్నారని, యువత మద్యానికి బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు తమ మేనిఫెస్టోల్లో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, రైతు పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు సర్వ హక్కులు కల్పిస్తామని పొందుపరిచి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, నిరుద్యోగులతో తెలంగాణ రాష్ట్ర రైతుకార్మిక జేఏసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, నాయకులు ప్రహ్లాద్, రాజు, తిరుపతయ్య, నాగన్న, భరత్, బాల్‌రాజు, మొగిలన్న, రాజేందర్‌రెడ్డి, సాయన్న, చెన్నయ్య, రైతులు ఉన్నారు.

సాగునీటి కాల్వలకు మరమ్మతులు



సాగునీటి కాల్వ మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పాన్‌గల్: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో కేఎల్ఐ డీ–8 కాల్వల్లో పేరుకుపోయిన జమ్ము, పూడికతీత పనులకు సోమవారం శ్రీకారం చుట్టినట్లు ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్ఐ డీ8 ఎంజీఆర్6 కాల్వలో పేరుకుపోయిన జమ్ము, పూడికతో సాగునీరు ముందుకు ప్రవహించకపోవడంతో చివరి ఆయకట్టు రైతులు సాగుచేసిన పంటలకు సక్రమంగా నీరు అందని విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లారు. దీంతో ఆయన స్పందించి సొంత ఖర్చులతో కాల్వ మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించడంతో హిటాచితో పనులు ప్రారంభించారు. మరమ్మతు పనులు పూర్తయితే పాన్‌గల్ మండలంతో పాటు కోడేర్ మండలంలోని చాలా గ్రామాల రైతులకు సాగునీరు సాఫీగా అందుతుందన్నారు. పనులు చేపట్టడంపై ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోడేరు సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, వైస్ చైర్మన్ శివయాదవ్, విండో డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు లాల్‌సింగ్‌నాయక్, విండో డైరెక్టర్ లక్ష్మణ్‌నాయక్, మండల కోఆప్షన్ సభ్యులు హలీం, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పెబ్బేరు రూరల్: దాడి ఘటనలో వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు శ్రీరంగాపురం పట్టణ కేంద్రంలోని చీర్ల బాలకృష్ణను ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన కటిక ఖాజా కర్రతో కొట్టడంతో తలకు గాయాలు అయ్యాయి. దీంతో బాధితుడి తల్లి చీర్ల జానమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కటిక ఖాజాపై కేసు నమోదు చేసి ఆర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

టీఎస్‌పీఎస్‌సీ బోర్డు రద్దు చేయాలి

వనపర్తి: పేపర్ లీకేజీలు, నిబంధనలు విస్మరించి పరీక్షలు నిర్వహిస్తున్న టీఎస్‌పీఎస్‌సీ బోర్డును రద్దు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో చెన్నరాములు, వంశీకృష్ణ, సుజాత, కార్తీక్, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

పెబ్బేరు రూరల్: జీఓ నంబర్ 142 వలన వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వివిధ క్యాడర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, ఆ జీఓను వెంటనే రద్దు చేయాలని డిప్యూటీ జిల్లా వైద్య అధికారి శ్రీనివాసులు తోటి ఉద్యోగులతో కలసి సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మణెమ్మ, శ్రీనివాస్ జీ, దామోదర్, నర్సింహ్మలు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు పదోన్నతులు కల్పించాలి



వనపర్తిలో కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు



పాన్‌గల్‌లో..

పెబ్బేరు రూరల్: మండల కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దబూది మన్యంకొండ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం డీపీఓ సురేష్‌కుమార్, కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్య బీమా, ఉద్యోగంలో చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అన్ని వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం సుధారాణి, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ పేస్కేల్ ఇచ్చి జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయత్‌రాజ్ శాఖ టెక్నికల్ వ్యవస్థలో 13ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు పదోన్నతులు కల్పించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

దళితుల హామీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని సీపీఐ అనుబంధ దళిత పోరాట సమితి జిల్లా కార్యదర్శి రవీందర్ ఆరోపించారు. సోమవారం వారు వనపర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా దళిత పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ యాదగిరికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని తొలిసారి మోసం చేసిన కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా విస్మరించారని దుయ్యబట్టారు. మూడు ఎకరాల భూమి, దళిత బంధు, పారిశ్రామికవేత్తలుగా చేయడం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పది శాతం కూడా అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల లోపు హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేరస్తులను కఠినంగా శిక్షించినప్పుడే దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు తగ్గుతాయన్నారు. హామీలను నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్ర కురుమయ్య, ఇబ్రాయిల్, శివకుమార్, కొండన్న, చిన్నకురుమన్న, వంశీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల కిందిగేరిలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద శ్రీదేదీప్య ప్రదర్శించిన భరతనాట్యం పలువురిని ఆకర్షించింది. భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరత నాట్యంలో ప్రతిభ కనబర్చిన చిన్నారిని వినాయక యూత్ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అశోక్, మణ్యం, విజయ్‌కుమార్, రమేష్, వేణు, అనీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై కళాజాతా



పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీరంగాపురం మండల కేంద్రంలోని తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు ఆటపాటల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యం చేశారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కల్లు, సారా, మద్యానికి ఓటును అమ్ముకోవద్దని కోరారు. అలాగే పరిసరాల శుభ్రత గురించి ఆటాపాట ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, సర్పంచ్ వినీలారాణి, సాంస్కృతిక బృందం సువర్ణ, శ్రీనివాసులు, నరసింహా, కృష్ణయ్య, రాధ, ప్రజలు పాల్గొన్నారు.

పండిత్ దీనదయాళ్‌కు నివాళి

అమరచింత: పండిత్ దీన్‌దయాల్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని బీజేపీ కట్ట వద్ద బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్యామ భాస్కర్, నరాల నారాయణ, మేర్వ అనిల్, రాకేష్‌శెట్టి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బచ్చు రాము ఆధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, జింకల కృష్ణయ్య, సీతారాములు, కుమారస్వామి, రామ్మోహన్, బాబురావు, అనుజ్ఞారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

కొత్తకోట రూరల్: శంకరసముద్రంలో ముంపునకు గురైన కానాయపల్లి గ్రామ నిర్వాసితులకు తగిన న్యాయం చేస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కానాయపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు బాధితులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీడీఎఫ్ అవార్డు పొందిన 1,034 ముంపు కుటుంబాలకు లక్కీ డిప్ ద్వారా ప్లాట్లు కేటాయించి అనంతరం 18ఏళ్ల వయస్సు పూర్తయిన వారికి, పీఎఫ్ అవార్డు పొందిన వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. అనంతరం కానాయపల్లి ముంపు బాధితులు కలెక్టర్‌తో మాట్లాడుతూ 1034 పీడీఎఫ్ అవార్డు పొందిన వారికి ఇప్పుడు పాట్లు ఇచ్చి తర్వాత పీఏఎఫ్ వారికి ప్లాట్లు ఇవ్వడం వల్ల పీఏఫ్ పొందిన 95 మంది నష్టపోతారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. లక్కీ డిప్ ద్వారా కాకుండా ఎస్ఈఎస్ పద్ధతితో ప్లాట్లు కేటాయించాలని కలెక్టర్‌ను కానాయపల్లి గ్రామస్తులు కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ పీఏఎఫ్ పొందిన వారికి ప్లాట్లు ఇవ్వడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉందని, అప్పటి వరకు ప్రస్తుతం పీడీఎఫ్ అవార్డు పొందిన వారికి ప్లాట్లు కేటాయిస్తామన్నారు. దీనికి గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో మీరే ఒక పరిష్కార మార్గంతో రావాలని, అప్పుడు దానిని అమలుకు సాధ్యసాధ్యాలపై చర్చిద్దామని కలెక్టర్ గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, కొత్తకోట తహసీల్దార్ బాల్‌రెడ్డి, సర్పంచ్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, భీమన్ననాయుడు, డీలర్ శ్రీనివాసులు, హోటల్ రాజు నాయుడు, శంకర్‌గౌడ్, బాజ గిరన్న, రవిందర్‌గౌడ్, గోవర్ధన్‌నాయుడు, వడ్డె నాగరాజు, దారమోని బాలరాజు, కొత్త అశోక్ తదిరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, డీపీఓ సురేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బాల్యానాయక్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన చెరువుల పండుగ, రైతు, గిరిజన ఉత్సవాల్లో ఖర్చు చేసిన డబ్బులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ఉత్సవాలకు సగం డబ్బులు చెల్లించి మిగతా డబ్బులు చెల్లింపులో జాప్యం చేస్తున్నారని వాపోయారు. దీంతో పాటు ఎల్ఈడీ బల్బుల బాధ్యతలను సర్పంచ్‌లకే అప్పగించాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే సర్పంచుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరికి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. పట్టణానికి చెందిన రాజు తన ఫోన్ చోరీకి గురయిందని జూన్ 6న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుగొన్న పోలీసులు గద్వాలలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన లేదా పోగొట్టకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

లక్ష్మీగణపతి హోమం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా సోమవారం లక్ష్మీగణపతి హోమాన్ని వేదమంత్రాల మధ్య అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరగుతున్న హోమానికి కొత్తకోట, కానాయపల్లి, పాలెం, నిర్వేన్ గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హోమంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.



నేతన్నల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన చేనేత క్లస్టర్ నిధులతో కొనుగోలు చేసిన 104 మగ్గాలు, జకాటి మగ్గాలను సోమవారం లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. చేనేత క్లస్టర్ ద్వారా మొదటి విడతలో రూ.24 లక్షలు మంజూరు అయ్యాయని, వీటితో నేతన్నకు ఉపయోగపడే మగ్గాలను పంపిణీ చేయడానికి జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర జౌళీ శాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్ ఎన్నో సార్లు విన్నవించారని, సిరిసిల్లలో చేనేత కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారిని తెలిపారు. గద్వాల, నారాయణపేట చీరల కన్నా అమరచింతలో తయారు చేసిన జరీ చీరలకు ఆదరణ ఎక్కువ అని, వీటికి సరైన మార్కెటింగ్ చేస్తే అమరచింత పేరు దేశ వ్యాప్తంగా మారుమోగుతుందన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో తక్కువ వయస్సు కలిగిన చేనేత కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నామన్నారు. అమరచింత చేనేత క్లస్టర్‌లో 236 మంది సభ్యులు ఉన్నారని వీరందరికి జియో ట్యాగింగ్ నంబర్ కలిగి ఉండటంతో సంక్షేమ పథకాలు వర్తించే అవకాశం ఉందన్నారు. త్వరలోనే చేనేత క్లస్టర్ భవనం కోసం రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్‌పర్సన్ ఎస్ఏ రాజు, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య, ఏడీఓ రాజేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులుగౌడ్ పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వలేదు

మగ్గాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు చేనేత సహకార సంఘంలో నెలకొన్న సమస్యలను విన్నవించేందుకు ఏడీ గోవిందయ్య తనకు అవకాశం ఇవ్వలేదని చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ ఆరోపించారు. సభకు అధ్యక్షత వహించిన తనకు మాట్లాడేందుకు ఏడీ గోవిందయ్య మైక్ ఇవ్వలేదని, కేవలం టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. చేనేత కార్మికుల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే సంఘం సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారనే నమ్మకంతో ఇక్కడి చేనేత కార్మికులు ఎదురు చూసిన మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం అసహనం వ్యక్తం చేశారు.